క్లుప్తంగా

నేడు రాజుకుంటలో గంగమ్మ జాతర

చిట్వేలి : మండల పరిధిలోని రాజుకుంట గ్రామంలో గురువారం గంగమ్మతల్లి జాతరను వైభవంగా నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలియజేశారు. బుధవారం రాత్రి పోతులరాజు, అంకాలమ్మ జాతరలు జరుగుతాయని, గురువారం తెల్లవారుజాము నుంచి గంగమ్మ జాతర నిర్వహిస్తామన్నారు.

మన్నూరులో..
రాజంపేట టౌన్ : మండలంలో రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మన్నూరు గంగమ్మ జాతరను గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది ఇంకా బలిజపల్లె గంగమ్మ జాతర జరగకపోవడంతో మన్నూరు జాతరకు భక్తులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉండటంతో నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

ఘనంగా జాంబవంతుడికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మ నగర్‌లో ఉన్న జాంబవంతుడి ఆలయంలో బుదవారం స్థానికులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం జాంబవంతుడికి అభిషేకాలు, అర్చనలతోపాటు అలంకరణ చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు.

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయులపై సందర్శన పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని ఇలా చేయడం మంచి కాదని ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) సంఘం నాయకులు ఆరోపించారు. బుధవారం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న 10వ తరగతి మూల్యాంకనంలో భాగంగా భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాయచోటి జనరల్ సెక్రటరీ రవిశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎస్టీయూ నాయకులు అనిల్, సి.రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి

సిద్దవటం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఆధార్‌లో సవరణలు చేసుకోవాల్సిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ 0 – 5 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు ముఖ్యంగా ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించాల్సి ఉందన్నారు. లేదంటే అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సరఫరా అయ్యే పౌష్టికాహారం అందదని పేర్కొన్నారు.

విరాళం అందజేత

పుల్లంపేట : మండల పరిధిలోని కోనెయ్యగారి పల్లి పంచాయతీలోని కొమానుపల్లి హరిజనవాడ గ్రామంలో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ఠకు రూ.20 వేలు విరాళాన్ని పుల్లంపేట మండలాధ్యక్షుడు ముద్దా బాబుల్‌రెడ్డి గ్రామస్తులకు అందజేశారు. టీకే మణి, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్‌గా మందల నాగేంద్ర




రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా మందల నాగేంద్ర నియమితులైనట్లు ప్రభుత్వం నుంచి బుధవారం ఉత్తర్వులు వెల్లువడ్డాయి. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో కాలం నుంచి సేవలందిస్తున్నందుకు తనను గుర్తించి తనపై నమ్మకంతో బాధ్యతాయుతమైన పదవి అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్లకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు వ్యవసాయ శాఖ మంత్రి రాక

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు చేతుల మీదుగా రేపు శుక్రవారం వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలలో పలు భవనాలు ప్రారంభించనున్నట్లు వ్యవసాయశాఖ అధికారి కవిత తెలిపారు.

అద్భుత ఘట్టం తపసుమాను కార్యక్రమం



సంబేపల్లె : గుట్టపల్లె గ్రామంలో సర్పంచ్ చిదంబరంరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం అర్జునుడు తపసుమాను ఎక్కే కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా అర్జున పాత్రదారి తపసుమాను ఎక్కుతూ పాడిన పద్యాలు వీక్షకులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. ప్రజలకు అర్జునుడు పాత్రదారి ప్రసాదాన్ని పంచిపెట్టారు. దండు శ్రీధర్ రెడ్డి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సంక్షేమాభివృద్ధిలో సరికొత్త అడుగులు

శెట్టిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గడికోట

సంబేపల్లె : జనరంజకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం శెట్టిపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లె, శెటిపల్లె కస్బా, సదిపిరివాండ్లపల్లె, దళితవాడ, దిన్నెమీదపల్లె, తిమ్మక్కగారిపల్లె, డీసివడ్డెపల్లె, దిగువ దళితవాడ, ఎగువ దళితవాడలలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగనన్న పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలతోపాటు సమాజంలో అభివృద్ధిని చేసి చూపారని ఆయన అన్నారు. పథకాల అమలులో ప్రతి ఒక్కరి సంతృప్తి స్థాయి పెరగడం జగనన్న పాలనకు నిదర్శనమన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుకొని పరిష్కార దిశగా చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో అర్హులైన వారికి ఇంటి స్థలాలు, పక్కాగృహాల మంజూరునకు గడికోట హామీ ఇచ్చారు. రైతులకు సంబంధించి అసైన్‌మెంట్ భూముల ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ మహేశ్వరిబాయికి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు.

పాపిరెడ్డిగారిపల్లెలో రూ. 3 లక్షలతో రహదారి, దిన్నెమీదపల్లెలో రూ.3లక్షలతో సీసీ రోడ్డు, రూ.2 లక్షలతో తాగునీరు పైపులైన్ పనులు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రైతులకు వేరుశనగ విత్తనకాయలు అందుబాటులో ఉండే విధంగా శెట్టిపల్లె, దుద్యాల గ్రామాలలో అదనపు పంపిణీ కేంద్రాలు ఏర్పాట చేసి రైతులకు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. రహదారి సౌకర్యం లేని ప్రాంతమైన మర్రిమేకలపల్లెకు ఎమ్మెల్యే బైక్‌లో వెళ్లి వారి సమస్యలను తెలుకున్నాడు. ప్రతి గడప గడపలో ఎమ్మెల్యే జి.శ్రీకాంత్ రెడ్డిని ప్రజలు ఎంతో ఆత్మీయంగా పలకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కవిత, మాజీ జెడ్పీటీసి ఉపేంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, అనిరుథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగిరెడ్డి, నాయకులు ఆనందర్‌రెడ్డి, న్యాయవాది శ్రీనివాసులరెడ్డి, లక్ష్మికర్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, బీసీ నాయకుడు శివయ్య తదితరలు పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటి అద్దాలు విద్యార్థులకు వరం
వైఎస్ఆర్ కంటి వెలుగు విద్యార్థులకు వరంలాంటిదని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శెటిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు.

వీరాంజనేయస్వామి తిరునాల పోస్టర్ల ఆవిష్కరణ
జిల్లాలో ప్రసిద్ధ ఆలయమైన గుట్టపల్లె శ్రీ వీరాంజనేయ స్వామి తిరునాలను పురస్కరించుకొని బుధవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి శ్రీ వీరాంజనేయ స్వామి తిరునాల పోస్టర్లను ఆవిష్కరించారు. మే 6 వతేదీ తిరునాలను నిర్వహించునున్నట్టు గుట్టపల్లె సర్పంచ్ చిదంబరంరెడ్డి తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యుల సహకారంతో పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

హామీలకు మించి పథకాలు అమలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు


బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

ఓబులవారిపల్లె : ప్రజా సంక్షేమమే సీఎం జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బొంతవారిపల్లి, పుటికివారిపల్లి దళితవాడ గ్రామాలలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, సర్పంచ్ జయపాల్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి ముంగిటకు వెళ్లి ప్రభుత్వం ద్వారా వారికి అందే సంక్షేమ పథకాలు గురించి వారు వివరించారు. కొరముట్ల మాట్లాడుతూ గత టీడీపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందక ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఆచరణకు సాధ్యంకాని హామీలతో చంద్రబాబు నాయుడు ఎన్నికలలో గెలిచి ప్రజలను వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్రతో వేలాది కిలోమీటర్లు పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకొని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో నవరత్నాలు ప్రవేశపెట్టారని, అధికారంలోకి వచ్చాకు ఇచ్చిన హామీలుకంటే ఎక్కువగా పథకాలు అమలు చేశారన్నారు. అనంతరం గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డులు, విద్యుత్, పక్కా గృహాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు కొరముట్ల దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణం సమస్యలను పరిష్కరించారు. బొంతవారిపల్లి గ్రామంలో రామాలయానికి రూ. 10 వేలను విరాళంగా అందించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటిమడుగు సుధాకర్‌రాజు, జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ సుంకేసుల రఫీ, వార్డు మెంబర్ ఉరిమిళ్ల మౌలా, వైఎస్సార్‌సీపీ నాయకులు టి.రాజశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సి.దుర్గారెడ్డి, హరి, గోపి, మైనార్టీ నాయకులు సయ్యద్ ఖాసీం, షేక్ మౌలా, సయ్యద్ ఖాదర్ బాషా, బియ్యాల శంకర్, షేక్ ఖలీల్, స్థానిక నాయకులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా రైతులు

ఓబులవారిపల్లె : ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు సాధించవచ్చని మహిళా రైతులు మంగళవారం చిన్నఓరంపాడు పంచాయతీలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనర్ నరసింహారెడ్డి మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్యను పెంచాలనే ఉద్దేశంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జీవామృతం, ఘనజీవామృతం అలాగే 30 రకాల నవధాన్యాల విత్తనాలు భూమిలో చల్లుకొని వాటిని 45 రోజుల తరువాత భూమిలో కలియదున్ను కోవడం ద్వార భూసారం పెరుగుతుందని చెప్పారు. అనంతరం మహిళలతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్దె సిద్దమ్మ, యూనిట్ ఇన్‌చార్జ్ బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..
రామాపురం : ఏక పంటలు వద్దు పలు పంటలు ముద్దు అని మండల ప్రకృతి వ్యవసాయ ఉత్తమ మహిళా రైతు సూరం శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వార ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నవధాన్యాలు సాగుపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు ర్యాలీ చేశారు. ప్రతి రైతు నవధాన్యాలు సాగు చేయాలని మాస్టర్ ట్రైనర్ మధుకర్ తెలిపారు. ఈ సంవ్సరం అన్నమయ్య జిల్లాకు రాగి పంట వేయుటకు సబ్సిడీతో విత్తనాలు ఇస్తారని మండల అగ్రికల్చర్ అధికారులు తెలిపారు. ప్రతి రైతు సొంతంగా ఘన జీవామృతం తయారు చేసుకొని విత్తనాలు బీజామృతంతో విత్తన శుద్ధి, నారు శుద్ధి చేసుకొని విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞంలో అన్నదానం


భోజనాన్ని వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : మండల కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న మహాభారత యజ్ఞం వీక్షించుటకు వచ్చిన ప్రజలకు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సరస్వతిపల్లె సర్పంచ్ మునీర్‌బాషా, మైనార్టీ నాయకుడు మహబూబ్‌బాషాలు సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని లక్కిరెడ్డిపల్లె మాజీ శాసనసభ్యుడు గడికోట మోహన్‌రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రమేష్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, దామోదర్‌నాయుడు, ఓబులేసు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. బుధవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని సయ్యద్ హీన కౌసర్ 1000 మార్కులకు గాను 936, ఎంపీసీ విద్యార్థిని నేహ నందిని 1000 మార్కులకు గాను 935 సాధించి కళాశాల టాపర్లుగా నిలిచినట్టు ప్రిన్సిపల్ రమణరాజు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో విద్యార్థులు కళాశాలలో మొత్తం 69 విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 48 మంది ఉత్తీర్ణులైనట్టు ఆయన తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించండి

పెనగలూరు : మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల అభివృద్ధి కోసం ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జయవేలు, రీసోర్స్ పర్సన్ నరసారెడ్డిలు కోరారు. బుధవారం మోడల్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల భౌతిక వనరులు, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ సౌకర్యంపై విద్యా కమిటీ చైర్మన్‌లతో పరిశీలించాలన్నారు. అలాగే ఆరోగ్య సూత్రాలు, ప్రథమ చికిత్సకు సంబంధించి రిపోర్టు ఇవ్వాలన్నారు.

మద్దిరేవులలో మా నమ్మకం నువ్వే జగన్


బుక్‌లెట్‌ను అందిస్తున్న ఉపసర్పంచ్ సంజీవరెడ్డి

లక్కిరెడ్డిపల్లె : ప్రజా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని ఉప సర్పంచ్ మద్దిరేవుల సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న వెంకటరమణ, వెంకటరామిరెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మద్దిరేవుల గ్రామం జీఎంఆర్ కాలనీలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతి గడప వద్దకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరాతీశారు. గత టీడీపి ప్రభుత్వ పాలన గురించి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనపై ప్రజాభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరయ్య, రమణయ్య, ఆనంద్, రమేష్, చక్రపాణి, ధనపాల్, అంజి, ప్రకాశ్, ఆంజనేయులు, కేశయ్య, ప్రవీణ్, బూత్ కమిటీ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం అభివృద్ధికి కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని శంకరాపురంలో ఉన్న స్కౌట్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణా కేంద్రం(రీజనల్ ట్రెయినింగ్ సెంటర్)అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డిని జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి కోరారు. ఈ విషయమై బుధవారం డీఈఓను తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలలోని స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు స్కౌట్ అంశాలపై శిక్షణ ఇవ్వడానికి ఈ ప్రాంతీయ శిక్షణా కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. శిక్షణా కేంద్రం నందు ప్రస్తుతం ఉన్న భవనాలు కూలిపోయే దశలో ఉన్నందున నూతన భవనాల నిర్మాణానికి, సుందరీకర ణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విన్నవించారు జిల్లా అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్‌కమీషనర్ లక్ష్మీకర, లగిశెట్టివాండ్లపల్లె స్కూల్ స్కౌట్ యూనిట్ ప్రధానోపాధ్యాయులు వంగమల్ల వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

మోడీ పాలనలో అభివృద్ధి శూన్యం

ఓబులవారిపల్లె : ప్రధాని నరేంద్ర మోడీ తొమ్మిదేళ్ల పరిపాలనలో అభివృద్ధి శూన్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు పేర్కొన్నారు. బుధవారం మండలంలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో జీపు జాతా కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కి పెత్తందారులకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. కేంద్ర సంస్థలను నష్టం కలిగిస్తూ కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిపోయాయని మండిపడ్డారు. మోడీ పాలనకు అంతం పలికి దేశాన్ని రక్షించుకుందామని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లాకార్యదర్శి శ్రీనివాసులు, మహేష్, రాధాకృష్ణ, చౌడవరం శంకరయ్య, సీపీఐ నియోజవర్గ నాయకులు జ్యోతి చిన్నయ్య, నాగమ్మ, ఎం.జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడీ చేసిన అభివృద్ధి శూన్యం
రాజంపేట రూరల్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో దేశంలో చేపట్టిన అభివృద్ధి శూన్యమని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు పీఎల్ నరసింహులు, శ్రీనివాసులు మండిపడ్డారు. సీపీఎం, సీపీఐ ప్రచార భేరి బుధవారం రాజంపేటకు చేరుకుంది. స్థానిక పాత బస్టాండులో ఈ సందర్భంగా నిర్వహించిన జీపుజాతలో పాల్గొని మాట్లాడారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోడీ నిరుద్యోగులను మోసం చేశారని తెలియజేశారు.

సులభ్ కాంప్లెక్స్ పనులు ప్రారంభం

నందలూరు(రాజంపేట) : కడప – చెన్నై హైవేలో అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్స్ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ సూర్యనారయణ ఆధ్వర్యంలో ఎంపీపీటీసీ పునగాని వెంకటసుబ్బమ్మ పనులకు పూజలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పెనుబాల నాగసుబ్బయ్య, పునగాని గుణయాదవ్, ఆల్విన్ కార్మిక సంఘం మాజీ నేత ఎముక దుర్గయ్య పాల్గొన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి

పెనగలూరు : పేదలకు భూములు పంపిణీ చేయాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి బుధవారం తహసీల్దార్ శ్రీధర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ధనికులకు కాకుండా భూమిలేని వారికే పట్టాలు ఇవ్వాలన్నారు. అసైన్మెంట్ కమిటీలో దళిత, గిరిజనులకు ప్రతి ఒక్కరికి ప్రభుత్వ భూమి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పెనగలూరు మండల కార్యదర్శి గానుగపెంట ఆదినారాయణ, సహాయ కార్యదర్శి ఈరి లక్ష్మినారాయణ, బీకేఎస్‌యూ మండలాధ్యక్షుడు రేవూరు శంకరయ్య, ఉపాధ్యక్షుడు రమణయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

28న విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో 28న శుక్రవారం అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఈఈ ఆర్.చంద్రశేఖర్ రెడ్డి బుధవారం తెలియజేశారు.

రాజంపేటలోని 220 కెవిఎస్ఎస్, టీజీపల్లి 132 కెవిఎస్ఎస్, 33 కెవి, 11 కెవి విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలియజేశారు. పట్టణ ప్రాంతమైన రాజంపేటతో పాటు మండలంలోని తాళ్ళపాక, ఆకేపాడు, బ్రాహ్మణపల్లి, కట్టకిందపల్లె, మందరం, కొండ్లోపల్లి, హెచ్.చెర్లోపల్లి, పుల్లంపేట మండలంలోని దళవాయిపల్లి, టి.కమ్మపల్లి, వత్తలూరు, రెడ్డిపల్లి, ఎస్ఆర్‌పాళెం, పుత్తనవారిపల్లి, పెనగలూరు మండలంలోని పెనగలూరు, కొండూరు, టి.జి.పల్లి, బెస్తపల్లి, చిట్వేలి మండలంలోని చిట్వేలి, పత్తిగుంటవారిల్లి, కస్తూరివారిపల్లి, భాకరాపురం సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలియజేశారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ సంస్థకు సహకరించవలసిందిగా కోరారు.

30న ఏపీజీఈఏ రాష్ట్ర సదస్సు

రాజంపేట రూరల్ : ఉద్యోగుల హక్కులు చట్టం చేయాలనే డిమాండ్ల సాధనకై ఈ నెల 30న రాజమహేంద్రవరంలో ఏపీజీఈఏ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు వై.శ్రీనివాసులురెడ్డి కోరారు. స్థానిక ఏపీజీఈఏ తాలూకా కార్యాలయంలో బుధవారం రాజంపేట, రైల్వేకోడూరు తాలుకా అధ్యక్షులు సిద్దిరామయ్య, ఇస్మాయిల్‌బాషా అధ్యక్షతన ఏపీజీఈఏ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు వై.శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి జి.గురుప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి నాయక్, జాయింట్ సెక్రటరీ శివరామిరెడ్డి, సెక్రటరీ రాజశేఖర్‌తోపాటు రాజంపేట, రైల్వేకోడూరు తాలుకా సభ్యులు పాల్గొన్నారు.

గోవులతో వాహనచోదకులకు తిప్పలు


రోడ్డుపై తిష్ట వేసిన ఆవుల మంద

రైల్వేకోడూరు అర్బన్ : మండల కేంద్రంలోని రహదారులపై ఆవులు రోజురోజుకూ అధికమై ప్రజలు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తిరుపతి – కడప ప్రధాన రహదారి పైన ఎక్కడపడితే అక్కడ ఆవులు పదుల సంఖ్యలో తిష్టవేసి వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటమే కాకుండా ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. రైల్వేకోడూరులో ఆవుల యజమానులు ఇళ్ల వద్ద వాటిని సంరక్షించుకోకుండా నిర్లక్ష్యంగా మూగజీవాలను రోడ్లపైకి వదులుతున్నారు. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు త్వరితగతిన పరిష్కరించాలని కోడూరువాసులు కోరుతున్నారు.

నేడు మిట్టపై కొలువుదీరనున్న గంగమ్మ


డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపు జరుపుతున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు గంగమ్మ జాతరలో భాగంగా నేడు (గురువారం) గంగమ్మ మిట్టమీద కొలువుదీరనుంది. భక్తుల తాకిడి దృష్ట్యా జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వాహకులు చేశారు. పట్టణం వీధులలో ప్రత్యేక విద్యుత్ అలంకరణ, చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పాత బజారు, కొత్త బజారు వీధులు భక్తులతో కిటకిటలాడాయి. తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు చేస్తున్నారు. గురువారం ఉదయం స్థానిక అంకాలమ్మ గుడి నుంచి గంగమ్మ మిట్టకు గంగమ్మ ఊరేగింపుగా రానుంది. పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టనున్నారు.